పిలిపించింది.


డాక్టర్ వచ్చి పరీక్షించాడు.

''ఇది పక్షవాతం స్ట్రోక్ లాగా ఉన్నదమ్మా ! పక్కూరు గవర్నమెంట్ ఆసుపత్రికి తీసుకుపోండి'' అని చెప్పి వెళ్లిపోయాడు.

రాజమ్మ తన భర్తను పిలిపించి, బండి కట్టించి.. అయ్యగారిని పక్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లింది. జానకమ్మ అంటే రాజమ్మకు చాలా ఇష్టం. ఇద్దరూ దాదాపు ఒకే ఈడువారు. దాదాపు ఒకే సంవత్సరం పెళ్లయి అత్తగారింటికి వచ్చారు. ఆ ఇద్దరి మధ్య స్నేహం బాగా అల్లుకుపోయింది. జానకమ్మ శ్రీవైష్ణవుల ఇంటి పిల్ల కాబట్టి.. రాజమ్మ ఆమెను ఎప్పుడూ గౌరవంగా 'అమ్మగారూ' అని పిలిస్తే.. జానకమ్మ ఆప్యాయంగా 'రాజమ్మా!' అని పిలిచేది.

రాజమ్మ సహకారంతో వరదాచార్యులకు చికిత్స చేయించింది జానకమ్మ. అతనికి పక్షవాతం అని డాక్టర్లు చెప్పారు. మంచంలో ఉలుకుపలుకు లేకుండా పడి ఉన్న చెట్టంత మనిషిని చూస్తుంటే గుండెలు ఆర్చుకుపోతున్నాయి జానకమ్మకు. ఇంట్లో తిరుగుతున్న ఇద్దరు చిన్నపిల్లలను చూస్తూ ఏం చేయాలో, జీవితాన్ని ఎలా గడపాలో తెలియక దుఃఖ సముద్రంలో మునిగిపోయింది. కొడుకు వెంకటాచార్యులకు తండ్రితో గడిపిన కొద్దికాలం ఒక కలగానే మిగిలిపోయింది. వెంకటాచార్యుల చిన్నతనంలో వరదరాజస్వామి ఆలయ పూజా విధానం, ఇప్పటికీ అతని కనుల ముందు కదులుతూ ఉంటుంది. ఆ జ్ఞాపకాలు అతనికి అమృత తుల్యాలు అయ్యాయి.

జానకమ్మ, వెంకటాచార్యులను ప్రాతఃపూర్వమే నిద్ర లేపి, స్నానం చేయించి, చిన్న పట్టు వస్త్రం పంచెగా కట్టేది. తిరువణి, శ్రీ చూర్ణంతో నామాలు తీర్చిదిద్దేది. ఆ చిన్ని బాలుడు ముగ్ధ మోహన రూపంతో ముద్దుగా గోచరించేవాడు. మార్గళి మాసం నెల రోజులూ, చలికి వణుకు పుడుతున్నా.. దైవ ధ్యానం చేస్తూ ఉంటే ఎంతో ఉత్సాహంగా ఉండేది వెంకటాచార్యులకు.



జానకమ్మ తెల్లవారుజామునే నిద్రలేచి, స్నానాదులు కానిచ్చి, దేవుడికి తిరువళిక ముట్టించి, కట్టె పొంగలి వండేది. దాన్ని నైవేద్య పాత్రలో ఉంచి, మరో పూజా పాత్రలో తులసి తీర్థం ఉంచి, ఆ రెండూ ఒక పళ్లెరంలో ఉంచి, పైన పట్టు వస్త్రం కప్పి తయారుచేసేది జానకమ్మ.

వరదాచార్యులు తయారై వచ్చి, ఆ పళ్లెరాన్ని తీసుకొని.. 'శ్రియః కాంతాయ కల్యాణ నిధయే నిధయే ర్థినాం..' అంటూ దైవధ్యానం చేస్తూ గుడివైపు నడుస్తూ వెళ్లేవాడు. అతని వెనకాలే చిన్ని వెంకటాచార్యులు చేతిలో తీర్థ కలశం పట్టుకుని తండ్రిని అనుసరిస్తూ వెళ్లేవాడు. వరదాచార్యులు తిరుప్పావై పారాయణం చేస్తూ గుడివైపు నడుస్తూ ఉంటే, దారిలో అతనికి ఎదురైన వారు ఆ పూజారికి నమస్కరించి పక్కకు జరిగేవారు.

ఆ అయ్యగారిని సాక్షాత్తూ దేవుడిగా భావిస్తూ నమస్కరించే వారిని చూస్తూ ఉంటే వెంకటాచార్యుల మనసులో పులకింత కలిగేది.

గర్భగుడిలోకి వెళ్లిన వరదాచార్యులు, సాలగ్రామాన్ని శుద్ధిచేసి తీర్థంతో సంప్రోక్షణ చేసేవాడు. పుష్పాలు, గంధం, అక్షతలు సమర్పించి పూజ చేసేవాడు. కర్పూర హారతి వెలిగించి, పెరుమాళ్లకు హారతి పట్టేవాడు. వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు ఇచ్చేవాడు వరదాచార్యులు. భక్తులు భగవంతునికి నమస్కరించి, పూజారికి కూడా పాదాభివందనం చేసేవారు. పూజారి అక్షతలు చల్లి ఆశీర్వచనాలు పలికేవాడు. ఆ సందర్భంలో ఆ భక్తులలో కనిపించే గౌరవ మర్యాదలు చూస్తున్న వెంకటాచారికి, తన తండ్రి ఎంతో గొప్పవాడని, సాక్షాత్తూ భగవంతుడే అన్న తలంపు కలిగేది. తాము ఎంతో గొప్పవాళ్లం కాబట్టే, అలా గౌరవిస్తున్నారని భావన కలిగేది.

కానీ, పక్షవాతం వచ్చి మంచాన పడిన తండ్రిని చూస్తూ ఉంటే.. అమ్మ కూలికి వెళ్లి తెచ్చిన జొన్న గటకతో కడుపులు నింపి, ఆకలి తీర్చుకుంటూ ఉంటే.. జీవితంలో మరోకోణం కూడా ఉంటుందని వెంకటాచార్యులకు అర్థమైంది.

* * *

శోక సముద్రంలో మునిగిపోయి ఉన్న జానకమ్మను అలా చూస్తూ ఉంటే రాజమ్మకు ఎంతో బాధేసేది. ఆ కుటుంబానికి ఎలా సహాయం చేయాలో అర్థం కాలేదు రాజమ్మకు. ఆ కుటుంబాన్ని ప్రధానంగా పీడించే సమస్య తిండి. అప్పుడే కరువుకాలం ప్రారంభమైంది. వరి పంట తక్కువై జొన్నలు అధికంగా పండేవి. ప్రజానీకం అవే తినటం అల

**'నమస్తే తెలంగాణ, ముల్కనూరు సాహితీపీఠం'**
**సంయుక్తంగా నిర్వహించిన**
**'కథల పోటీ-2023/24'లో**
**రూ.3 వేల బహుమతి పొందిన కథ.**